కాంగ్రెస్ హవా

- పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం
- హస్తం బలపర్చిన అభ్యర్థులు 6,714 మంది గెలుపు
- బిఆర్ఎస్ మద్దతుదారులు.3,461 మంది విజయం
- బిజెపి 685, ఇతరులు 1634
- 22న సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారం
- ఏర్పాట్లు చేసిన పంచాయతీరాజ్ శాఖ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. ఈ నెల 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో జరిగిన పోలింగ్‌లో అన్నింటా హస్తం హవా కొనసాగింది. రాష్ట్రంలో మొత్తం 12,728 సర్పంచ్ స్థానాలను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఇందులో 22 స్థానాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండు స్థానాలపై కోర్టు స్టే విధించింది. 1,207 స్థానాలు ఏకగ్రీవం కాగా, 11,497 స్థానాలకు పోలింగ్ జరిగింది. మూడు విడతల్లోనూ కాంగ్రెస్ మెజార్టీ సర్పంచ్ స్థానాలను దక్కించుకుంది. తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 6,714 స్థానాల్లో గెలుపొందారు. బిఆర్ఎస్ మద్దతుదారులు 3,461 స్థానాల్లో గెలిచారు. బిజెపి 685 చోట్ల, ఇతరులు 1,634 స్థానాల్లో విజయం సాధించారు. నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కామారెడ్డి, జగిత్యాల, సంగారెడ్డి, మహబూబాబాద్ మొదలగు 28 జిల్లాల్లో కాంగ్రెస్ ఆధిక్యాన్ని చాటింది. ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థులు పెద్దఎత్తున గెలుపొందారు. సిద్దిపేట, కుమరంభీం ఆసీఫాబాద్, మెదక్, రంగారెడ్డి, వరంగల్, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆ పార్టీ మద్దతు దారులు గట్టి పోటీ ఇచ్చారు. రెండో విడతలో నిర్మల్ జిల్లాలో అనూహ్యంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను వెనక్కి నెట్టి బిజెపి మద్దతుదారులు మెజార్టీ స్థానాలను దక్కించుకున్నారు. మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థులు మెజార్టీ స్థానాలను దక్కించుకోగా, బిఆర్ఎస్ రెండవ స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ పార్టీ 53, బిఆర్ఎస్ 27.5, బిజెపి 5.5, ఇతరులు 14 శాతం వరకు స్థానాలకు దక్కించుకున్నారు. సర్పంచ్ స్థానాల్లో గణనీయమైన స్థానాలు దక్కించుకున్న నేపథ్యంలో జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సర్కార్ మౌఖిక ఆదేశాల మేరకు అధికారులు తగిన కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

మూడు విడతల్లో ఆయా పార్టీల మద్దతు దారుల బలాబలాలు

పార్టీలు	కాంగ్రెస్	బిఆర్ఎస్	బిజెపి	ఇతరులు
1). మొదటి విడత	2,332	1,168	189	537
2). రెండో విడత	2,244	1,188	268	626
3). మూడో విడత	2138	1,105	228	471
మొత్తం	**6714**	**3461**	**685**	**1634**

(రాత్రి 9.30 గంటల వరకు)

22న కొత్త సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారం

పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ నెల 22న బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రమాణస్వీకారం చేయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఏర్పాట్లు చేసింది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు కొత్తగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

తుది విడత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జోరు

తుది విడత పంచాయతీ ఎన్నికల్లోనూ అధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలకు దక్కించుకుంది. మొదటి, రెండో విడతల్లో అత్యధిక స్థానాలు గెలుచుకుని ఊపు మీదున్న ఆపార్టీ.. చివరి విడతలోనూ సత్తా చాటింది. బుధవారం జరిగిన పోలింగ్‌లో 3,752 సర్పంచ్ స్థానాలకు 12,652 మంది, 28,410 వార్డు స్థానాలకు 75,618 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 1,948 స్థానాల్లో గెలుపొందారు. బిఆర్ఎస్ మద్దతుదారులు 1,017 స్థానాల్లో గెలిచారు. బిజెపి 197 చోట్ల, ఇతరులు 417 స్థానాల్లో విజయం సాధించారు.

మూడో విడతలో 85.76 పోలింగ్

చివరి దశ పంచాయతీ ఎన్నికల్లో 85.86 శాతం పోలింగ్ నమోదైంది. ఈ మేరకు తెలంగాణ ఎన్నికల సంఘం మూడో దశ పోలింగ్ వివరాలను బుధవారం వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా మూడో విడతలో 182 మండలాల్లోని 3,752 పంచాయతీలు, 75,725 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.56 శాతం, ఆ తర్వాత మెదక్ జిల్లాలో 90.68, సూర్యాపేటలో 89.25, శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యల్పంగా నిజామాబాద్ జిల్లాలో 76.45 శాతం, ఆ తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లాలో 79.14, జగిత్యాలలో 79.64 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు కొంత మందకొడిగా సాగింది. మొదటి రెండు గంటల్లో 23.52 పోలింగ్ నమోదు కాగా, అ తర్వాత 9 నుంచి 11 గంటల వరకు 57.91 శాతం ఓటింగ్ నమోదైంది. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చివరి వరకు మొత్తం 85.77 శాతానికి చేరుకుంది.

ఏకగ్రీవం, నామినేషన్ దాఖలు కాని గ్రామాలను మినహాయిస్తే మొత్తం 50,56,344 మంది ఓటర్లకు గాను 43,37,024 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 21,21,269 మంది పురుషులు (86.59 శాతం), 22,15,683 మంది మహిళలు (85.96 శాతం), 72 మంది ఇతరలు (50.70 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికలసంఘం తెలిపింది.

4.7 శాతం మంది ఓటింగ్‌కు దూరం

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో 14.7 శాతం మంది ఓటేయలేదని ఎన్నికల సంఘం గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 1,66,55,186 ఓటర్లు ఉన్నారు. అందులో 81, 42,231 మంది పురుషులు, 85, 12,455 మంది మహిళలు, 500 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. మొదటి విడతలో 84.28 శాతం పోలింగ్ నమోదైంది. (45,151,41 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు). రెండో విడతలో 85.86 శాతంగా నమోదైంది. (46,70,972 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు). మూడో విడతలో 85.76 శాతం పోలింగ్ నమోదైంది. (43,37,024 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు). మొత్తం మూడు విడతల్లో కలిపి 85.3 శాతం ఓటింగ్ నమోదైంది.

'ఉపాధి' చట్ట నిర్వీర్యాన్ని వ్యతిరేకిస్తున్నాం

- నేడు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలో నిరసనలు
- బిల్లుల ప్రతుల దహనం : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని .సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. గ్రామీణ పేదలకు నష్టం చేకూర్చే కేంద్రం నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో గ్రామాల్లో, 20న మండల కేంద్రాల్లో నిరసనలు చేయాలనీ, ఉపాధి హామీ చట్టం సవరణ బిల్లు ప్రతులను దహనం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చింది. బుధవారం ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బలహీన వర్గాలకు చెందిన 30 కోట్ల మందికిపైగా పేదలకు ఉపాధి కల్పిస్తున్న చట్టాన్ని నీరుగార్చడం తగదని పేర్కొన్నారు. పనిదినాలను పెంచామని చెబుతూ కూలీల సంఖ్య పెద్ద ఎత్తున కుదించడం సరిగాదని పేర్కొన్నారు. ఇప్పుడున్న చట్టంలో కేంద్రం 90 శాతం, రాష్ట్రం పది శాతం నిధులు విడుదల చేస్తున్నాయని తెలిపారు. అయితే, ప్రస్తుత బిల్లులో కేంద్రం ఇచ్చే నిధుల శాతాన్ని 60 శాతానికి కుదించడం, 40 శాతం నిధులను రాష్ట్రాలే భరించాలని పేర్కొనడం దారుణమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అతి జోక్యంతో ఇప్పటికే నిధుల లేమితో అల్లాడుతున్న చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమలు చేయకుండా ఎత్తేసే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు ఉన్న సమయంలో 60 రోజుల పాటు ఉపాధి హామీ పనులను ఆపడం వల్ల కార్మికులు పనికోల్పోయే అవకాశం ఉంటుందని ఎత్తిచూపారు. చట్టానికి ఉన్న మహాత్మాగాంధీ పేరును తొలగించి ఇప్పుడు వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గారీ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి జి రాం జీ)గా మార్చడాన్ని తప్పుబట్టారు. ఉపాధి హామీ పని దినాలను 200కి పెంచాలని, రోజు కార్మికునికి రూ.307 నుంచి రూ.600 వరకు పెంచడంతో పాటు ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



క్లాసులకు రాలేదని విద్యార్థులపై ప్రిన్సిపల్ దాడి !

- ఇద్దరు పదో తరగతి విద్యార్థుల చేతులు విరిగిన వైనం
- విషయం బయటకు రాకుండా యాజమాన్యం యత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేములవాడ పట్టణంలోని హంసిని డీజీ హైస్కూల్‌లో అమానుష ఘటన జరిగింది. స్కూలుకు రాలేదన్న కారణంతో ఇద్దరు పదో తరగతి విద్యార్థులను ప్రిన్సిపల్ తీవ్రంగా కొట్టిన విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో ఒక విద్యార్థి చేయి విరగ్గా.. మరో విద్యార్థి చేతి వేళ్లు విరిగినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సాయి, అయాన్ అనే విద్యార్థులు పలు కారణాల వల్ల కొద్ది రోజులు పాఠశాలకు హాజరు కాలేకపోయారు. ఇందులో అయాన్ తల్లికి శస్త్రచికిత్స జరగడంతో సుమారు 15 రోజులపాటు ఆమెను చూసుకునేందుకు స్కూల్‌కు రాలేకపోయాడు. తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండటంతో కుటుంబ బాధ్యతలు తనపై పడినట్టు అయాన్ మీడియాకు వివరించాడు. స్కూల్‌కు తిరిగి వచ్చిన అనంతరం తన పరిస్థితిని వివరిస్తూ క్లాస్‌కు వెళ్లేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ, మాథ్స్ నోట్స్ పూర్తి చేయలేదన్న కారణంతో అయాన్, మరో విద్యార్థి సాయిపై ప్రిన్సిపల్ సంతోష్ దాడి చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని, చికిత్స తీసుకుంటున్నట్టు సమాచారం. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందిని నిలదీయగా, విషయం బయటకు రాకుండా చూడాలని యాజమాన్యం బేరసారాలకు దిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హంసిని డీజీ హైస్కూల్ ప్రారంభం నుంచి ఏటా ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలుస్తోంది. రాజకీయ నాయకుల అండతో పాఠశాల యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ఐడిపిఎల్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

- సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐడిపిఎల్ భూములపై వస్తున్న వివాదాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడాన్ని సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ స్వాగతిస్తుందని జిల్లా కార్యదర్శి పి.సత్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐడిపిఎల్ భూములు కబ్జాలకు గురవుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, ఈ భూముల్లో 50 ఏండ్ల నుంచి నివాసం ఉంటున్న పేదలను మినహాయించి మిగతా భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని కోరారు. 891 ఎకరాల ఐడిపిఎల్ భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆ భూమిని ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని పేర్కొన్నారు. 1967లో ఐడిపిఎల్ పరిశ్రమ కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసి కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిందని తెలిపారు. ఐడిపిఎల్ సంస్థ 47 రకాల ఔషధాలను తయారు చేస్తూ దేశానికి, ప్రజలకు ఎనలేని సేవలు అందించిందని పేర్కొన్నారు. ప్లేగ్ వ్యాధి ప్రబలిన సందర్భంలో ఏ సంస్థలూ ముందుకు రాని సమయంలో ఐడిపిఎల్ ప్రజలకు ఔషధాల్ని అందించి రక్షించిందని, అలాంటి పరిశ్రమను 2003లో కేంద్రంలోని నాటి వాజ్‌పేయ్ ప్రభుత్వం మూసేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ స్థాపన కోసం కేంద్రానికి భూమిని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. పరిశ్రమ మూతపడిన తర్వాత తిరిగి దాన్ని స్వాధీనం చేసుకునేందుకు తగిన ప్రయత్నాలు చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐడిపిఎల్ భూములపై న్యాయపరమైన అంశాలను పరిష్కరించుకుని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఐడిపిఎల్‌లో పని చేసిన కార్మికులు కంపెనీ మూతపడటంతో తీవ్రంగా నష్టపోయారని, వారికి పెన్షన్ కూడా తగిన పద్ధతుల్లో రావడం లేదని, ఆ భూముల్లో కార్మికులకు కొంత కేటాయించాలని పేర్కొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ

- రాహుల్‌గాంధీకి రాజ్యాంగంపై గౌరవం లేదు
- ఉప ఎన్నికలకు భయపడే అనర్హత వేటు వేయని స్పీకర్
- ప్రజాక్షేత్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎప్పుడో అనర్హులు : కెటిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కెటిఆర్) విమర్శించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నిర్ణయం ప్రజాస్వామ్యస్ఫూర్తికి, రాజ్యాంగానికి విరుద్ధమని తెలిపారు. ఈ మేరకు కెటిఆర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేదని పేర్కొన్నారు. ఫొటోలకు ఫోజులిచ్చేందుకు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదని తెలిపారు. ఆయన తండ్రి రాజీవ్‌గాంధీ తెచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టాన్నే గౌరవించలేని అసమర్థ నాయకుడిగా రాహుల్‌గాంధీ చరిత్రలో మిగిలిపోతారని పేర్కొన్నారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలే అనేక సార్లు బాహాటంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఉప ఎన్నికలకు భయపడే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయలేదని తెలిపారు. స్పీకర్ నిర్ణయం కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు చెప్పిన తీర్పుల స్ఫూర్తిని పట్టించుకోకుండా కేవలం కాంగ్రెస్ ఒత్తిడికి తలొగ్గి స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

సాంకేతికంగా అడ్డుపెట్టుకుని గోడ దూకిన ఎమ్మెల్యేలను తాత్కాలికంగా కాపాడినట్టు కాంగ్రెస్ సంబరపడినా ప్రజాక్షేత్రంలో వారు ఎప్పుడో అనర్హులయ్యారని కేటీఆర్ స్పష్టం చేశారు.

రాజకీయ లబ్ధికోసం రాజ్యాంగ సంస్థలను దిగజార్చిన సిఎం : హరీశ్‌రావు

రాజకీయ లబ్ధికోసం రాజ్యాంగ వ్యవస్థలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దిగజార్చిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని కాపాడాలన్న నినాదం స్పీకర్ ఇచ్చిన తీర్పుతో తేటతెల్లమైందని తెలిపారు. ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా దెబ్బతీసి రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగ నియమాలను పూర్తిగా పక్కనపెట్టారని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడాలన్న నినాదం మాటలకే పరిమితమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని తెలిపారు. ఇది సిగ్గుచేటనీ, ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ అని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు : వినోద్‌కుమార్

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని బిఆర్ఎస్ మాజీ ఎంపి బి వినోద్‌కుమార్ తెలిపారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు స్వయంగా ఎమ్మెల్యేలే మాట్లాడారని గుర్తు చేశారు. పార్టీ మారలేదంటూ స్పీకర్ చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 10వ షెడ్యూల్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని సూచించారు. పార్టీ ఫిరాయింపులపై పార్లమెంటులో వెంటనే ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్‌గాంధీ తెచ్చిన చట్టం పనికిమాలినదిగా స్పీకర్ తీర్పుతో తేలిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ తెచ్చిన ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ఆ పార్టీయే చంపేసిందని పేర్కొన్నారు.

సంక్రాంతికి 16 అదనపు ప్రత్యేక రైళ్లు


- దక్షిణ మధ్య రైల్వే ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి సందర్భంగా 16 అదనపు ప్రత్యేకంగా రైళ్లు నడపనుంది. ఈ మేరకు బుధవారం దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సికింద్రాబాద్, వికారాబాద్ నుంచి శ్రీకాకుళం రోడ్‌కు ఈ రైళ్లు వెళ్తాయని పేర్కొన్నది. జనవ రి తొమ్మిది నుంచి 19 మధ్య ఈ రైళ్లు ప్రయాణీలకు అందుబాటులో ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్ఒ శ్రీధర్ ఒక ప్రకటన విడుదల చేశారు.కాగా 07288/07290/o07292/ 07293 నెంబర్లు గల ట్రైన్లు సికింద్రాబాద్ నుంచి శ్రీకాకుళం వెళతాయి. ఇవి చర్లపల్లి, కాజీపేట్, వరంగల్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, ఆరపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, ఆనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా శ్రీకాకుకళం రోడ్ స్టేషన్‌కు చేరుకుంటాయి. అలాగే 07294/07295 నెంబర్లు గల ట్రైన్లు లింగంపల్లి, బేగంపేట్, సికింద్రాబాద్, చర్లపల్లి, కాజీపేట్, వరంగల్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, ఆనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌కు చేరుకుంటాయని దక్షిణ మధ్యరైల్వే అధికారులు తెలిపారు. అలాగే 07297 నెంబరు గల ట్రైన్ ఈనెల 18న మచిలీపట్నం నుచి ఉమ్దానగర్ వెళ్లనుండగా, 07296 నెంబరు గల ట్రైన్ ఈనెల 19న తిరుపతి నుంచి కాచిగూడకు ప్రయాణిస్తుందని తెలిపారు. ఇకపోతే 07298 నెంబరు గల ట్రైన్ ఈనెల 20న తిరుపతి నుంచి ప్రయాగరాజ్‌కు వెళుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

మళ్లీ ధ్వంసమైన మానేరు చెక్‌డ్యామ్‌లు

- నాణ్యతాలోపంతో రూ.కోట్ల నిధులు నీళ్ల పాలు
- భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల సరిహద్దులో ఘటన
- కొట్టుకుపోయిన మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు..



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద పోటెత్తుతుంటే నీటిని ఒడిసి పట్టే అనకట్టలు ఎక్కడికక్కడ ధ్వంసమై వరదల్లో కొట్టుకుపోతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. మానేరు నదిలో నీటి ప్రవాహం పెరగడంతో నీటి తాకిడికి చెక్‌డ్యామ్ కొట్టుకుపోయిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం వల్లెంకుంట గ్రామ పరిసరాల్లో బుధవారం చోటుచేసుకుంది. చెక్‌డ్యామ్ గోడ కూలిపోవడంతో నీరంతా దిగువకు వృథాగా పోతూ పంట పొలాలు ధ్వంసమయ్యాయి. కాగా, భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల సరిహద్దుల్లో గత ప్రభుత్వ హయాంలో మానేరుపై నిర్మాణం చేపట్టిన చెక్ డ్యామ్‌లు వరద తాకిడికి ఇప్పటికే రెండు సార్లు కొట్టుకుపోవడంతో కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ చెక్‌డ్యామ్ పూర్తిగా ధ్వంసమవడంతో నిర్మాణానికి వెచ్చించిన నిధులు నీళ్లపాలయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ చెక్‌డ్యామ్ కొట్టుకుపోవడానికి అధికారుల పర్యవేక్షణా లోపంతో కాంట్రాక్టర్లు నాణ్యాతా ప్రమాణాలు పాటించకపోవడమే కారణమా అన్న అనుమానం కలుగుతోంది. అయితే, ఈ ఘటన జరిగిన సమయంలో నదిలో చేపలు పడుతున్న ఇద్దరు మత్స్యకారులు ప్రవాహ ఉధృతికి కొద్దిదూరం కొట్టుకుపోయారు. తర్వాత వారు ఈదుకుంటూ ఒడ్డుకు చేరడంతో వారికి ప్రాణాపాయం తప్పింది.

మల్హర్‌రావు మండలంలో రైతుల పంట పొలాలకు అవసరమైన నీటిని నిల్వ చేయాలనే ఉద్దేశంతో చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. కాగా, మల్లారం-అడవి సోమన్‌పల్లి, తాడిచెర్ల-ఖమ్మంపల్లి చెక్‌డ్యామ్‌లు గత రెండేళ్ల క్రితం ధ్వంసమవ్వగా, మళ్లీ నిధులు కేటాయించి నిర్మించారు. మల్లారం మానేరు నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి మొదటిసారి రూ.ఎనిమిది కోట్లపైనే ఖర్చు చేశారు. కాగా, తేలికపాటి వరదల్లో చెక్‌డ్యామ్‌తో పాటు పక్కనున్న పొలాలు సైతం కోతకు గురయ్యాయి. రెండోసారి రూ.16.62 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. తాడిచెర్ల, ఖమ్మంపల్లి మానేరుపై రూ.14.31 కోట్లతో, సోమన్‌పల్లి, పివి నగర్ మానేరుపై రూ.13.40 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. అయితే, బుధవారం ఉదయం మానేరు నదిలో ఒక్కసారిగా నీటిప్రవాహం పెరగడంతో చెక్‌డ్యామ్ కొట్టుకుపోయింది.

అధికారుల పర్యవేక్షణాలోపం.. పనుల్లో లేని నాణ్యత..

చెక్ డ్యాములు తరచూ వరదల్లో కొట్టుకపోవడం పరిపాటిగా మారింది. చెక్‌డ్యామ్ నిర్మాణ పనులపై సంబంధించిన ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ పనుల్లో క్వాలిటీ లేకనే తరచూ వరదల్లో కొట్టుకుపోతు న్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మానేరుపై 500 మీటర్ల పొడవుతో నిర్మాణం చేయనున్న చెక్‌డ్యామ్ పనుల్లో సైడ్ వాల్స్ అడుగు భాగంలో కాంట్రాక్టర్లు దుబ్బమట్టి పోయకపోవడంతో, చెక్ డ్యామ్‌లకు ఇరువైపులా కరకట్టలు కట్టకపోవడంతో పొలాలు కోతకు గురయ్యాయని రైతులు వాపోతున్నారు.

శాశ్వత పరిష్కారమేది..

ఆయకట్టల నిర్మాణంలో భాగంగా ముందుగా వాగులో గట్టితనం వచ్చే వరకు ఇసుకను పూర్తిగా తోడి బెడ్ నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఇసుకపై పునాది వేయడంతో చెక్‌డ్యామ్ కింద నీటిని ఎత్తిపోసేందుకు నిర్మించిన ఆప్రాన్లు రిటైనింగ్ వాక్స్, అబార్ట్‌మేంట్ భాగాలు వరద ఉధృతికి దెబ్బతింటున్నాయి. నీటి ప్రవాహాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోయింది. ఇసుక మేటలు పూర్తిగా తొలగించకుండానే చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టడంతో దెబ్బతింటున్నాయని పరివాహక ప్రాంత రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వెళుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఉపాధికి ఉరేసిన బిజెపి సర్కారు

- చట్టాన్ని పథకంగా మార్పు
- ఎంజిఎన్ఆర్ఇజిఐకి గాడ్సే వారసులు పాతర
- కొత్త బిల్లుతో కార్మికులకు కుచ్చుటోపి
- చట్టబద్ధంగా యంత్రాల ప్రవేశం
- దేశవ్యాప్త ఆందోళనలకు వ్యకాస సన్నద్ధం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ భారతంలో కుల, మత, లింగభేదం లేకుండా అన్ని రకాల ప్రజలకు వారి జీవన హక్కులను బలోపేత చేయటానికి 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రీమీణ ఉపాధి హామీ చట్టం (నరేగా) పార్లమెంట్ ఆమోదించింది. మొట్టమొదటి యుపిఎ ప్రభుత్వ కాలంలో వామపక్షాల సంపూర్ణ మద్దతుతో రూపొందింది. 2014లో బిజెపి కేంద్రంలో అధికారం చేజిక్కించుకోగానే ఆ చట్టానికి తూట్లు పొడవటం మొదలు పెట్టింది. దాని స్ఫూర్తినే నాశనం చేసేందుకు చర్యలు చేపట్టింది. పార్లమెంట్‌లో తయారైన శాసనానికి గాంధీని చంపిన గాడ్సే వారసులు.. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న ఈ చట్టాన్ని ఏ విధమైన చర్చ లేకుండా దానికి మార్పులు చేయటం ద్వారా ..చట్ట స్ఫూర్తినే కాక భారత ప్రజాస్వామ్య స్ఫూర్తిపై కూడా దాడి ప్రారంభించింది.

పాత చట్టానికి పాతర

పేదల పొట్ట కొట్టేందుకే ఎంజిఎన్ఆర్‌జిఐ చట్టానికి మోడీ ప్రభుత్వం పాతరేస్తున్నది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మను, అమలు విధానాన్నీ మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా ఉన్నాయి. కేంద్ర విధానం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉంది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును "వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) : "వీబీ–జీ రామ్‌జీ"గా మార్చే బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.

రాష్ట్రంలో తగ్గిన పనిదినాలు

తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకానికి ప్రతి ఏడాది నిధుల్లో భారీ కోత విధిస్తూ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాలరాసింది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా తెలంగాణనే. గత ఏడాది రాష్ట్రంలో 12.5 కోట్ల పని దినాలు కల్పించగా, ఈ ఏడాది కేవలం 7.5 కోట్ల పని దినాలకే పరిమితమయింది. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడం వంటి గొప్ప లక్ష్యాలతో నాటి యుపిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇటువంటి నిర్ణయాలు తీసుకొచ్చింది. గతంలో వంద శాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపనుంది. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమే ఇది. పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. మొదటి నుంచే దీని పట్ల మోడీ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలకు పాల్పడింది. చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి వంద రోజుల ఉపాధి కల్పించాల్సి ఉన్నప్పటికీ, బిజెపి కేంద్ర ప్రభుత్వం ఏ సంవత్సరంలోనూ 42 రోజులకన్నా ఎక్కువ పనిదినాలు కల్పించలేదు.

చట్టం పథకమైతే..

చట్టం కాస్త పథకంగా మారితే..ఉపాధి హక్కును హరించినట్టే. పథకం అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. ఇప్పటి వరకూ గ్రామీణ పేదలు అనుభవిస్తున్న ఉపాధిహామీ చట్టం కల్పించిన హక్కు రద్దవుతుంది. గ్రామీణ ప్రాంత నిరుద్యోగాన్ని ఎదుర్కొనేందుకు వ్యవసాయ కార్మికులకు కనీస ఉపాధిని గ్యారంటీ చేయడానికి 2005లో వామపక్ష ఉద్యమంతో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టాన్ని సాధారణ సంక్షేమ పథకంగా మార్చే కుట్రకు కేంద్రం ఒడిగట్టింది. నేటి వ్యవసాయ సంక్షోభంలో కనీసం 200 పనిదినాలు కల్పించాలనీ, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మికులు డిమాండ్ చేస్తుంటే..దాన్ని పెడచెవిన పెట్టి. మందబలం ఉంది కదా అని కార్మికుల కడుపు కొట్టేందుకు పూనుకుంది.

పేరు మార్పు ఒక ముసుగు

కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన సవరణ బిల్లు, పేరు మార్చడానికి మాత్రమే ఉద్దేశించిందిగా చూస్తే తప్పు.. అదోక ముసుగు. పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన పేరుతో చేసిన సవరణ అది అత్యంత ప్రమాదకరమైంది. 197/2025 పేరుతో తీసుకొచ్చిన వికాస్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గారన్ అజిడికా మిషన్ (విబిజిజి రామ్) అనే కొత్త బిల్లు అమల్లోకి వస్తే ఉపాధికి ఉరే. వంద రోజుల పని దినాలను 125 రోజుల పనిదినాలుగా పెంచుతూ చేసిన నిర్ణయంలో మతలబు లేకపోలేదు. నిజానికి దీన్ని ఎత్తేయటానికి ఇదొక తురుపు ముక్క మాత్రమే. యంత్రాల ప్రవేశానికి చట్టబద్ధత కల్పించినట్టవుతుంది. హక్కుగా పని చూపించాల్సిన అవసరం ఉండదు. ఇప్పటి వరకూ జాతీయ స్థాయిలో కుటుంబానికి వంద రోజులు పనిదినాలు గ్యారంటీ కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకూ సగటున 50 పనిదినాలు కూడా కల్పించటం లేదు. దీన్ని ప్రశ్నించేందుకు అవకాశం ఉండదు. చట్ట ప్రకారం పని కల్పించాల్సిన రోజులకు నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. మోడీ ప్రభుత్వం దీన్ని ఎక్కడా అమలు జరపలేదు. ఇక నుంచి ఇదేందని అడగటం కుదరదు. భూస్వాములు, పెత్తందార్ల ఒత్తిళ్లకు తలొగ్గి క్రమంగా ఈ చట్టానికి పాతరేసింది. ఇప్పటి వరకూ హక్కుగా ఉన్న ఈ చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి దొరకడమే కాకుండా వ్యవసాయ వేతనాల స్థిరీకరణకు కూడా కొంతవరకు తోడ్పడింది. వలసలు కొంతవరకు ఆగాయి. పట్టణాలకు కూడా దీన్ని విస్తరించాలని వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఉపాధి హామీని ఎత్తివేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుతంత్రాలను మానుకోవాలని వ్యవసాయ కూలీలు, పేద, మధ్యతరగతి రైతులు, పట్టణశ్రామికులు కేంద్రాన్ని కోరుతున్నాయి.

ఈ చట్టం అమలైతే.. కార్మికులకు కష్టాలే : బి వెంకట్

కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పాతరేసి కార్మికుల మెడకు ఉరితాడు పేనుతోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పేర్కొన్నారు. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దీని స్థానంలో నూతన బిల్లు 197/2025 పేరుతో తీసుకొచ్చింది. ఇది కనుక అమలైతే వ్యవసాయ కార్మికులకు తీవ్ర ఇబ్బందులు రాక తప్పవు. పాతచట్టాన్ని ఎందుకు రద్దు చేస్తున్నారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. పాత చట్టాని కంటే అభివృద్ధికరమైన అంశాలు ఏమున్నాయో ప్రజలకు వివరించాలి. పాత చట్టం వల్ల ఉపాధి హామీకి నష్టం జరుగుతుందనా? లేదు..పాత చట్టం ఉండటం వల్ల ఎక్కువ పనిదినాలు, ఎక్కువ గ్రామాలకు అందించలేకపోతున్నామనా? దీన్ని పరిశీలించాలి. గతంలో 100 రోజులు పనికల్పించాము, ఇప్పుడు 125రోజులు పని దినాలు కల్పిస్తామని ఒక ముసుగును తగిలిస్తున్నారు. గాంధీని చంపిన గాడ్సే వారసులే.. ఇప్పుడు గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కూడా చంపబోతున్నారు. గతంలో ఉపాధి హామీ చట్టంలో చట్టబద్ధంగా వంద రోజులు పని గ్యారంటీ ఉండేది. పని అడిగితే పని ఇవ్వాలి. పని ఇవ్వకుండా తప్పించుకునే అవకాశం లేదు. అలాగే పని అడిగిన 15 రోజుల్లో గనుక ఉపాధిని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. దాంట్లో కొన్ని రాజీ లేని సూత్రాలు ఉన్నాయి. వీటికి తిలోదకాలిచ్చి మోడీ ప్రభుత్వం ఉపాధి కార్మికుల ఉసురు తీస్తున్నది.

ఉపాధి హామీని చంపే కుట్ర : మంత్రి సీతక్క

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని చంపే కుట్రకు కేంద్రం తెరలేపింది. ఆ చట్టం పేరునే కాకుండా, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా ఉన్నాయి.



ఎన్నికలను బహిష్కరించిన ఎర్రవెల్లి రైతులు

- ఎర్రవెల్లి, గోకారం భూనిర్వాసితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మేం ఏం పాపం చేశాం.. గ్రామసభల తీర్మానం లేకుండానే నష్టపరిహారం నిర్ధారణ చేయకుండానే భూములను ఎలా సేకరిస్తారు.. న్యాయమైన ధర నిర్ణయించి రైతుల అంగీకరముంటేనే భూములు సేకరించాలని చట్టాలు చెబుతున్నాయి.. కానీ, మమ్మల్ని ఆదుకోవడం లేదు.. భూమికి భూమి ఇచ్చే వరకు ప్రభుత్వానికి సహకరించేది లేదు.. గ్రామపంచాయతీ ఎన్నికలే కాదు.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఏ ఎన్నికలైనా బహిష్కరిస్తాం" అంటూ ఎర్రవెల్లి, గోకారం భూనిర్వాసిత రైతులు హెచ్చరించారు. బుధవారం జరిగిన మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎర్రవెల్లి గ్రామస్తులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. చారగొండ మండలం ఎర్రవల్లి, గోకారం రిజర్వాయర్‌లో 550 కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయి. ఎర్రవెల్లి, ఎర్రవెల్లి తండా, గోకారం, జెపల్లి గ్రామాలలో రైతులు 1600 ఎకరాల సాగు భూమి కోల్పోతున్నారు. ముంపు నివారణ చర్యలు చేపట్టే వరకు తాము ఓట్లు వేయబోమంటూ ఎర్రవల్లి గ్రామస్తులు 16 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆ గ్రామంలో 659 మంది ఓటర్లున్నారు. ఈ దీక్షలకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింత ఆంజనేయులు, వంగూరు, చారగొండ మండలాల కార్యదర్శి బి.బాలస్వామి సంఘీభావం తెలిపి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భూములు తీసుకునే విషయంలో ప్రభుత్వం రైతులకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదని సిపిఎం నాయకులు అన్నారు. రైతులు ఎంత భూమిని కోల్పోతున్నారో అంత వేరే చోట చూపించి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. అందరం ఐక్యంగా ఉంటూ గ్రామాన్ని కాపాడుకుంటామని, ప్రభుత్వం దిగొచ్చే వరకు ఈ దీక్షలు కొనసాగిస్తామని, దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రవెల్లి, గోకారం రిజర్వాయర్ నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు ఏకుల ప్రకాష్, పెద్దయ్య గౌడ్, నేనావత్ నాగయ్య, మునావత్ సంజీవ, అలవాల శేఖర్, ఏకుల పర్వతాలు, నేనావత్ రాంభూపాల్, బలరాం, మునావతి దేవేందర్, మునావత్ గోపి, సూగురి శ్రీరాములు, ప్రేమయ్య, మోత్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాబ్ ఇండియా కొత్త వింటర్ కలెక్షన్స్ ఆవిష్కరణ

హైదరాబాద్ : ఆహ్లాదకరమైన శీతాకాలపు సాయంత్రాల కోసం కొత్త వింటర్ కలెక్షన్లను ఆవిష్కరించినట్లు ఫ్యాబ్ ఇండియా తెలిపింది. సున్నితమైన అల్లికలు, ఆలోచనాత్మక అంశాలతో క్రిస్మస్ పండుగ ఆకర్షణను మిళితం చేస్తూ.. హాయిగా, అందంగా వ్యక్తిగతంగా ఉండేలా చేస్తాయని పేర్కొంది. సమకాలీన డిజైన్‌ను మిళితం చేస్తూ వింటర్ క్యురేషన్ 2025 ప్రతి ఒక్కరికి సంతృప్తినిచ్చేలా రూపొందించబడ్డాయని తెలిపింది.

ఎమ్మెల్యేపై కెటిఆర్ వ్యాఖ్యలు అవాస్తవం

- వెడ్మ బొజ్జు పటేల్ నిత్యం ప్రజల్లో ఉంటారు
- కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన విమర్శలను కాంగ్రెస్ నాయకులు, ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం ఖండించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కంటే జాన్సన్ నాయక్ స్థానికంగా ఎక్కువగా అందుబాటులో ఉంటారని హైదరాబాద్‌లో జరిగిన బిఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎమ్మెల్యే ప్రతిరోజూ మార్నింగ్ వాక్ కార్యక్రమం ద్వారా గ్రామాలు, వార్డుల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమై ప్రత్యక్షంగా సమస్యలు తెలుసుకుంటున్నారని తెలిపారు. ఆ సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం వంటి అనేక ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజలు ఆకర్షితులై గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించి పట్టం కట్టారని తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా సర్పంచ్ స్థానాలు కాంగ్రెస్ గెలిచిందన్నారు. దీనితో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని ఈ ఎన్నికల్లో ప్రజాబలం స్పష్టంగా నిరూపితమైందని తెలిపారు. మరోసారి తమ ఎమ్మెల్యే జోలికి వస్తే గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆదివాసీ ముద్దుబిడ్డగా ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కెటిఆర్ ఇటువంటి మతిభ్రమించిన వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజిద్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, కాంగ్రెస్ మండల జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, తర్లపాడ్ సర్పంచ్ సచిన్, ఉపసర్పంచ్ నర్సయ్య, నాయకులు జంగిలి శంకర్, రాజు నాయక్, గూడాల రాజన్న, శేషాద్రి, సంతోష్ ఉన్నారు.

షాహీ ఎక్స్‌పోర్ట్ కంపెనీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కార్మిక మంత్రి సానుకూల నిర్ణయం తీసుకోవాలి
- లేకపోతే జాగృతి పోరాటం : కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాచారంలోని షాహీ ఎక్స్ పోర్ట్ కంపెనీలో ధర్నా చేస్తున్న కార్మికులకు తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత మద్దతు ప్రకటించారు. బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కార్మికులు కవితను కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కార్మికుల పోరాటం స్ఫూర్తిదాయకమని, అలాగే కొనసాగించాలని సూచించారు. లేబర్ కమిషనర్ స్పందించాలని కోరారు. కార్మిక మంత్రి వివేక్ వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్లుగా ఆ కార్మికుల జీతాలు పెరగలేదనీ, కార్మిక చట్టాలు అమలు కావటం లేదనీ, కరువు భత్యం ఇవ్వడం లేదని ఆమె విమర్శించారు. రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో మహిళా కార్మికులు, ఇతర కార్మిక సంఘాలతో కలిసి జాగృతి లేబర్ చట్టాల అమలు కోసం పోరాడుతుందని హెచ్చరించారు. అక్కడ పని చేస్తున్న 2,500 మంది మహిళలకు న్యాయం చేయాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు.

గురుకుల విద్యార్థులను కాపాడండి

గురుకులాల్లో విద్యార్థులు బలికాకుండా వారిని కాపాడాలని కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సర్కారు నిర్లక్ష్యంగా ఆరోగ్యం విషమించిన తర్వాత హైదరాబాద్‌కు తరలించడంతో నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ ఎస్‌సి గురుకులంలో 8వ తరగతి విద్యార్థిని సాయి లిఖిత ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న వంద మంది విద్యార్థులు మరణించినా, నిత్యం ఫుడ్ పాయిజన్‌తో వందల సంఖ్యలో ఆస్పత్రుల్లో చేరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. మరో విద్యార్థి చనిపోకముందే చర్యలు తీసుకోవాలనీ, సాయి లిఖిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

రవీందర్ రావు అక్రమాలు ఆధారాలతో బయటపెడతాం : శ్రీకాంత్ గౌడ్

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ రవీందర్ రావు అక్రమాలను మానుకోటలో ఆధారాలతో సహా బయటపెడతామని తెలంగాణ జాగతి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్ ను సర్వనాశనం చేసిన చరిత్ర రవీందర్ రావుదని ఆయన ఆరోపించారు. తన విద్యా సంస్థల్లో సిబ్బందికి జీతాలివ్వకుండా ఎగ్గొట్టి, విద్యార్థుల ఉపకారవేతనాలు కాజేసిన రవీందర్ రావుకు వేల కోట్ల రూపాయలు, శ్రీరామగిరిలో 65 ఎకరాలు, నెరేడా దగ్గర 30 ఎకరాల ఫామ్‌హౌస్, కన్సికల్‌లో 10 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్టీసీ ఉద్యోగి లక్ష్మారెడ్డి దగ్గర 8 ఎకరాల భూమిని రవీందర్ రావు లాక్కున్నారని ఆరోపించారు. శంకర్ నాయక్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని 10 ఎకరాల మామిడి తోట రాయించుకున్నారని తెలిపారు. అధికార ప్రతినిధి మనోజా గౌడ్ మాట్లాడుతూ రవీందర్ రావు తన బీ.ఈడీ కాలేజీలో పేద మహిళలకు అన్యాయం చేశారని ఆరోపించారు. తన అన్నదమ్ముల ఆస్తులను కూడా రవీందర్ రావు లాక్కొని ఇబ్బంది పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేరు మారిస్తే పేదల బతుకు మారదు : ఎల్.రూప్ సింగ్

గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చినంత మాత్రాన పేదల బతుకులు మారవని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్ విమర్శించారు. వంద రోజులు పని కల్పించకుండా ఎగ్గొట్టిన బీజేపీ 125 రోజులు ఏ విధంగా పని కల్పిస్తుంది? అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ విధానాలు పేదలను మరింత పేదలుగా మార్చేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేర్లను మార్చడంలోనే ఆసక్తి చూపిస్తోందనీ, ఈ విషయంలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని ఆయన విమర్శించారు. లేనిపక్షంలో ఆ రెండు పార్టీలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మైలార్‌దేవ్‌పల్లిలో కారు బీభత్సం

- ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న తండ్రీకొడుకు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓవర్ స్పీడ్‌లో ఉన్న ఇన్నోవా కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న దుకాణాలపైకి దూసుకెళ్లడంతో ఫుట్‌పాత్‌పై వేసుకున్న గుడిసెలో నిద్రిస్తున్న తండ్రీకొడుకు మృతి చెందారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రభు మహారాజ్ (55) తన ఇద్దరి కొడుకులైన దీపక్ (25), సత్తునాథ్‌తో కలిసి కాటేదాన్ ప్రాంతానికి వలస వచ్చారు. మైలార్‌దేవ్‌పల్లి ప్రధాన రహదారి పక్కన చిన్న గుడిసె ఏర్పాటు చేసుకొని రగ్గులు, దుప్పట్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి దుప్పట్లు అమ్మి గుడిసెలో తన ఇద్దరి కొడుకులతో కలిసి నిద్రపోయారు. అయితే తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో శంషాబాద్ నుంచి ఎల్బీనగర్ వెళు_న్న ఇనోవా కారు ఓవర్ స్పీడ్‌లో రావడంతో అదుపుతప్పి ఫుట్‌పాత్‌పై గుడిసెలో నిద్రిస్తున్న వారిపై నుంచి వెళ్లింది. దాంతో దీపక్ అక్కడికక్కడే మృతి చెందగా మహారాజ్, సత్తునాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రభు మహారాజ్ మృతి చెందారు. కారులో ఉన్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అరీట్ హాస్పిటల్‌లో స్ట్రైవాకర్ అర్థోపెడిక్ రోబోటిక్ సిస్టమ్ ప్రారంభం

- తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి

ప్రజాశక్తి - హైదరాబాద్

అమెరికా కేంద్రంగా పని చేస్తోన్న మైక్రోపోర్ట్ అర్థోపెడిక్స్ ఇంక్ సహకారంతో హైదరాబాద్‌లోని ఆరీట్ హాస్పిటల్స్‌లో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స కోసం స్ట్రైవాకర్ అర్థోపెడిక్ రోబోటిక్ సిస్టమ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సాంకేతికతను తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి తాము అందుబాటులోకి తెచ్చామని ఆ హాస్పిటల్ క్రిటికల్ కేర్ మెడికల్ డైరెక్టర్ అండ్ హెచ్ఒడి డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇది ఆరోగ్య రంగంలో ఒక కీలక మైలురాయిగా నిలువనుందన్నారు. రోగులకు నిజమైన మార్పు తీసుకొచ్చే ఆవిష్కరణలను సమగ్రంగా అమలు చేయడమే ఆరీట్ హాస్పిటల్స్ లక్ష్యమన్నారు. స్ట్రైవాకర్ ప్రారంభం క్లినికల్ ఎక్సలెన్స్ వైపు మా ప్రయాణంలో మరో మైలురాయి అన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఈ సాంకేతికతను మొదటగా అందించినందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అరీట్ డైరెక్టర్, రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జరీ డాక్టర్ ప్రభాత్ రెడ్డి లక్కీరెడ్డి, మైక్రోపోర్ట్ అర్థోపెడిక్స్ ప్రతినిధి డాక్టర్ ముకేష్ పరమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

స్పీకర్ నిర్ణయానికి అందరూ కట్టుబడాల్సిందే

- కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- తీర్పునకు సిఎంకు సంబంధం లేదని వ్యాఖ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నిర్ణయానికి అంతా కట్టుబడి ఉండాల్సిందేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే స్పీకర్ మెరిట్ ఆధారంగా తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. స్పీకర్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని ఖండించారు. బుధవారం అనర్హత పిటిషన్లపై స్పీకర్ తీర్పు అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ కూడా ఫిరాయింపులపై మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. టిడిపి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్‌ను క్యాబినెట్‌లోకి తీసుకున్న విషయాన్ని మరిచిపోయారా ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకున్న సంగతి గుర్తు లేదా? అని అడిగారు. పదేళ్లల్లో 39 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బిఆర్ఎస్‌లోకి చేర్చుకున్న నీచ చరిత్ర మీదని విమర్శించారు. ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదులను ఏనాడూ బిఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఫిరాయింపులపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ కూడా టిడిపి నుంచి బిఆర్ఎస్‌లోకి వెళ్లాడని చెప్పారు. కోరుట్ల బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్‌ఓటింగ్‌కు పాల్పడి సస్పెండ్ అయ్యాడనీ, ఇప్పుడు ఆయన కొడుకు సంజయ్ ఫిరాయింపులపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజ్యాంగబద్ధంగా ఇరుపక్షాల వాదనలు విన్నతర్వాతే బిఆర్ఎస్ అనర్హత పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేశారని స్పష్టం చేశారు. స్పీకర్ తీర్పుపై బిఆర్ఎస్ హైకోర్టుకు వెళ్లొచ్చు, ఆపై కోర్టులకు కూడా పోవచ్చన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వస్తే ఒకరకంగా, రాకపోతే మరోరకంగా బిఆర్ఎస్ వ్యవహరిస్తోందని విమర్శించారు. స్పీకర్ ఏకపక్ష నిర్ణయం తీసుకోలేదని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మూడు దశల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఘన విజయం సాధించారని చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డిపైన కడుపు మంటతోనే బిఆర్ఎస్ నాయకులు కండ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని అన్నారు. పదేండ్లల్లో ప్రజాస్వామ్యాన్నీ ఖూనీ చేసిన చరిత్ర బిఆర్ఎస్‌ది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ తీర్పుకు, సిఎం రేవంత్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. లియోనల్ మెస్సీలాంటి దిగ్గజ ప్రపంచ ఫుట్‌బాల్ ఆటగాడు హైదరాబాద్‌కు వచ్చినా బిఆర్ఎస్ వాళ్లు ఓర్వలేకపోయారని చెప్పారు.

కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే ఫలితాలు

- సిఎం రేవంత్‌రెడ్డి మైండ్‌బ్లాక్ : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మండలంలో మల్కాపూర్, కోనైపల్లి, నర్సంపల్లి గ్రామాలతోపాటు అచ్చంపేట నియోజకవర్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత మండలం వంగూరులో పది గ్రామాల్లో బిఆర్ఎస్ మద్దతుతో గెలిచిన సర్పంచులకు మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం వారు హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సర్పంచులకు శాలువాలతో సత్కరించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత మండలం వంగూరులో కాంగ్రెస్ ప్రలోభాలను తట్టుకుని గెలిచిన సర్పంచులను ప్రత్యేకంగా అభినందించారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయని అన్నారు. ప్రజల తీర్పు చూసి కాంగ్రెస్ నాయకులకు షాక్ తగిలిందని చెప్పారు. ఓటమి భయంతో పోలీసులను అడ్డం పెట్టుకుని బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని వివరించారు. కెసిఆర్ పాలనలో ఢిల్లీలో తెలంగాణ పల్లెలకు అవార్డు వస్తే ఇప్పుడు రేవంత్ హయాంలో ఒక్క అవార్డు కూడా రావడం లేదని అన్నారు. పల్లెలు అపరిశుభ్రంగా మారాయని చెప్పారు. కనీసం ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పల్లె ప్రకృతి వనాలు, డంపు యార్డులు మూలకు పడ్డాయని, అందుకే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని, దాడులు మానుకోకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ దిశగా వెళ్తోందని, మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, కెసిఆరే సిఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.



గ్రామాల్లో ప్రజలకు మెరుగైన పాలన అందించాలి

- నూతన ప్రజా ప్రతినిధులకు మంత్రి పొంగులేటి సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి గ్రామంలో ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యతని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలిచిన ప్రజా ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు శాలువా కప్పి, స్వీట్లు తినిపించి మంత్రి అభినందనలు తెలిపారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులను కూడా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకంగా, బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులు అధైర్యపడొద్దని, పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తూనే ఉండాలని తెలిపారు. అందరూ కలిసికట్టుగా ముందుకు సాగి గ్రామాలను అభివృద్ధి పరచాలని పిలుపునిచ్చారు.

సన్నబడిపోయిన శ్వాసనాళానికి విజయవంతంగా చికిత్స

- ఫినాయిల్ తాగిన యువకుడికి పెద్ద కష్టం
- కిమ్స్ వైద్యుల సంక్లిష్ట శస్త్రచికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్



అనుకోకుండా జరిగి ప్రమాదంతో దానికి జరిగిన చికిత్సల కారణంగా శ్వాసనాళం సన్నబడిపోయి ఊపిరి ఆడక ఇబ్బంది పడుతున్న ఓ యువకుడికి గచ్చిబౌలిలోని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు శ్వాసనాళాన్ని పునరుద్ధరించి కొత్త జీవితం అందించారు.. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ మినిమల్ ఇన్వేసివ్, రోబోటిక్ సర్జన్ అండ్ ఆంకో–థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి సి తెలిపారు. "నగరానికి చెందిన ఓ యువకుడు సుమారు రెండేళ్ల క్రితం అనుకోకుండా ఫినాయిల్ తాగాడు. దాంతో అతడి శ్వాసనాళం బాగా దెబ్బతింది. అతడి ఉదరభాగం నుంచి ఆ పదార్థాలను తొలగించేందుకు పలుమార్లు వరుసగా చికిత్సలు చేశారు. అలా క్రమక్రమంగా అతడి శ్వాసనాళం బాగా సన్నబడిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో అతడు మా ఆస్పత్రికి వచ్చాడు. అతడికి అవసరమైన పరీక్షలన్నీ చేసిన తర్వాత అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి శ్వాసనాళాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుందని నిర్ణయించాం. ఉన్నదానికే మరమ్మతు చేయాలి. లోపల క్షుణ్నంగా పరీక్షించగా.. దాదాపు మూడున్నర సెంటీమీటర్ల మేర శ్వాసనాళం సన్నబడిపోయి, పనికిరాదని తేలింది. దాంతో దాన్నంతటినీ కత్తిరించి తీసేసి, మిగిలినదాన్ని అత్యాధునిక విధానాలతో కొంత సాగదీసి బాగున్న రెండు భాగాలు కలిపి అతికించాం. దాంతో అతడి శ్వాసనాళం పూర్వస్థితికి చేరుకుంది." అని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు. ఈ చికిత్సలో సీనియర్ కన్సల్టెంట్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ విజయ్, డాక్టర్ రామ ఫణీంద్ర సహకారంతో పూర్తి చేశామన్నారు.